
నేడు సీఎం చంద్రబాబు రాక

పెద్దాపురం, సామర్లకోటలో పర్యటన





సీఎం పర్యటన ఇలా.. 6

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం తొలి సారిగా కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజక వర్గంలో సీఎం చంద్రబాబు శనివారం రోజంతా పర్యటించనుండడంతో అటు ప్రజాప్రతినిధులే కాదు, జిల్లాఅధికార యంత్రాంగం సైతం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉండవిల్లిలోని సీఎం చంద్రబాబు స్వగృహం నుంచి శనివారం ఉదయం 10.10 గంటలకు హెలీకాప్టర్‌లో బయలుదేరతారు. 11.00 గంటలకు పెద్దాపురం రోడ్లో ఏర్పాటుచేసిన హెలీపాడ్‌లో దిగుతారు. 4.40 గంటలకు పర్యటన ముగించుకుని హెలీకాప్టర్‌లో అమరావతికి బయలుదేరతారు. ఈమేరకు 1,045 మందితో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వీరిలో అడిషనల్ ఎస్పీలు ఐదుగురు, డీఎస్పీలు 14 మంది, సీఐలు 51 మంది, ఎస్ఐలు 91 మంది, ఏఎస్ఐలు, హెచ్‌సీలు 183 మంది, పోలీసులు 467 మంది, మహిళా పోలీసులు 69 మంది, హోం గార్డులు 165 మందితో బందోబస్తు నిర్వహించనున్నట్టు కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. సామర్లకోట పూర్ణా కల్యాణ మండపంలో శుక్రవారం మధ్యాహ్నం బందోబస్తు సిబ్బందికి తగు ఆదేశాలిచ్చారు. ఆయా వేదికల వద్ద నిఘా విస్తృతం చేశారు. మునుపెన్నడూ లేనివిధంగా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. పాస్‌లు ఉన్న వారినే లోనికి అనుమతించనున్నారు. ఆయా సంస్థలకు చెందిన పాత్రికేయులు ఒక్కొక్కరిని మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఇక విస్తృత బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా పోలీసు అధికారులు పలు వాహనాలను దారి మళ్లిస్తూ ట్రాఫిక్ చర్యలు చేపట్టారు. సామర్లకోట నుంచి పెద్దాపురం వెళ్లే అన్ని భారీ వాహనాలను సామరకోట ఏడీబీ రోడ్డు మీదుగా పెద్దాపురంనకు శుక్రవారం సాయంత్రం నుంచే మళ్లిస్తున్నారు. పిఠాపురం, కిర్లంపూడిల మీదుగా సామర్లకోట మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. ఆర్టీసీ బస్సులను ఏడీబీ రోడ్డు మీదుగా మళ్లిస్తున్నారు. సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ సామర్లకోట, పెద్దాపురంలలో పర్యటిస్తూ కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్‌లకు సూచనలిచ్చారు. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సమావేశాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

హెలికాప్టర్ ట్రయల్ రన్

సీఎం చంద్రబాబు పర్యటన దృష్ట్యా ముందస్తుగా భద్రతా చర్యల్లో భాగంగా అమరావతి నుంచి సామర్లకోటకు హెలీకాప్టర్ ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించారు. సామర్లకోట-పెద్దాపురం రోడ్‌లో హెలీపాడ్ ఏర్పాటుచేశారు. సామర్లకోటలో హెలీకాప్టర్ ల్యాండ్ అయిన తర్వాత మళ్లీ అమరావతికి తరలివెళ్లింది.

సీఎం గారూ...
ఇదీ సమస్యల తీరు!
మాటతో 'మూటివ్వండి'



(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాను ఎన్నో ఏళ్లుగా పలు కీలక సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గత వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిధులు మంజూరవక పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. వీటిని పట్టాలెక్కించి నిధులు విడుదల చేస్తేనే వాటికి మోక్షం. అయితే సీఎం చంద్రబాబుకు జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక ప్రేమ ఉన్న నేపథ్యంలో వీటి పూర్తికి నిధులు విడుదల చేస్తారని అంతా ఆశిస్తున్నారు. శనివారం ముఖ్యమంత్రి పెద్దాపురం పర్యటనకు వస్తుండడంతో ఆయన దృష్టికి పలు కీలక సమస్యలను తీసుకువెళ్లి

- నేడు సీఎం చంద్రబాబు పర్యటన
- నిధుల కోసం కలెక్టర్ ప్రత్యేక నివేదిక
- జీజీహెచ్‌కు రూ.500 కోట్లకు వినతి
- స్మార్ట్‌సిటీకి రూ.186 కోట్లు కావాలి
- జయలక్ష్మి బాధితులకు న్యాయం

నిధులు కోరేందుకు జిల్లా కలెక్టర్ శాన్‌మోహన్ నివేదిక సిద్ధం చేశారు. ముఖ్యంగా ఏలేరు ఆధునికీకరణ, ఉమ్మడి తూ.గో.జిల్లాకు కీలకమైన జీజీహెచ్ అభివృద్ధి, కాకినాడ స్మార్ట్‌సిటీకి నిధుల బెంగ తీర్చడం, ఉప్పాడ సముద్రపు కోత నివారణ, జయలక్ష్మి సొసైటీ ఆస్తులను వేలం వేయించి డిపాజిటర్లకు న్యాయం చేయడం వంటి పలు ప్రధాన అంశాలను పర్యటనలో సీఎంకు వివరించనున్నారు. అటు ముఖ్యమంత్రి కూడా నేటి పర్యటనలో జిల్లాకు వరాలు కురిపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పేదలకు పెద్దదిక్కు జీజీహెచ్‌లో ప్రధాన భవనాలు శిథిలస్థితికి చేరుకున్నాయి. వినియోగానికి పనికిరావని ఇంజనీర్లు అనేకసార్లు నివేదికలిచ్చినా నిధుల్లేక అదే భవనాల్లో వైద్యసేవలందిస్తున్నారు. కొత్త బ్లాకుల నిర్మాణానికి రూ.500 కోట్లు నిధులివ్వాలని కలెక్టర్ కోరబోతున్నారు.
- కాకినాడ స్మార్ట్‌సిటీకి ఏటా కేంద్రం రూ.100 కోట్ల నిధులిస్తుంది. అదే స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం తన వంతు ఏటా ఇంకో రూ.100 కోట్లు సమకూర్చాలి. కానీ గత వైసీపీ ఈ నిధులను విడుదల చేయకుండా స్మార్ట్‌సిటీని ముప్పు తిప్పలు పెట్టింది. దీంతో స్మార్ట్ సిటీ దివాళా స్థితిలో ఉంది. అటు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇంకా రూ.186 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా ఇవి విడుదల కాలేదు. ఈ నిధులు విడుదల చేస్తే అభివృద్ధి పనులు వేగవంతమవుతాయి.
- కాకినాడ కేంద్రంగా జయలక్ష్మి సొసైటీ బ్యాంకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రూ.520 కోట్ల మేర డిపాజిటర్లను మోసం చేసింది. దీంతో సీఐడీ రంగంలోకి దిగి సంస్థ ఆస్తులను సీజ్ చేసింది.కానీ ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. సీజ్ చేసిన రూ.450 కోట్ల విలువైన ఆస్తుల్లో కొంతైనా వేలం వేసి చిన్న డిపాజిటర్లకు డబ్బులు చెల్లించే వీలున్నా సీఐడీ కనీసం ఆ దిశగా ప్రయత్నం చేయకపో వడంతో బాధితులు అల్లాడుతున్నారు.కనీసం 40 శాతమైనా నష్టపోయిన వారికి చెల్లించడానికి రూ.200 కోట్లు మంజూరు చేయాలని కలెక్టర్ శాన్ మోహన్ సీఎంను కోరనున్నారు.
- కాకినాడ ఉప్పుటేరుపై సుమారు ఏడేళ్ల కిందట శంకుస్థాపన చేసిన మూడో వంతెన నిర్మాణంపై ఇప్పటికీ కలగానే మిగిలింది. కాకినాడలో వాహనాల రద్దీ తగ్గించేందుకు పాత పోర్టు రైల్వే స్టేషన్ నుంచి ఏటిమొగ మీదుగా యానాం రోడ్డుకు కలిసేలా ఉప్పుటేరుపై రూ.146 కోట్లతో మూడో వంతెన నిర్మాణానికి 2018 నవంబర్ 26న శంకుస్థాపన చేశారు.ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో నిర్మాణం మూలన పడింది. ఏడీబీ రోడ్ నుంచి పోర్టు మీదుగా ఎన్‌హెచ్ 216 రహదారికి కలిసే ఈ వంతెన నిర్మాణం వల్ల నగరంలో వాహనాల రద్దీ తగ్గనుంది. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కోరుతూ కలెక్టర్ తన నివేదికలో ప్రస్తావించారు.





ఏలేరుతోనే మోక్షం...

గతేడాది ఏలేరు వరద లతో తొమ్మిది మండలాల్లో కాలువలకు 60 చోట్ల గండ్లు పడ్డాయి. కేవలం పదివేల క్యూసెక్కుల వరదను మాత్రమే తట్టుకోగలిగే సామర్థ్యం ఉన్న కాలువల్లోకి 47వేల క్యూసెక్కుల వరద వచ్చి పడడంతో తొమ్మిది మండలాలు నష్టపోయాయి. ఏలేరు వరద కారణంగా 34,812 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిం ది. మొత్తం 24,879 మంది రైతులు నష్టపోయారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వం ఏలేరు ఫేజ్1 పూర్తికి రూ.142 కోట్లు, ఫేజ్2 పూర్తికి 150 కోట్లు ఇస్తానని మోసగించింది. ఈలోపు సవరించిన అంచనాలు రూ.663 కోట్లకు చేరుకున్నాయి.గతేడాది సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణకు నిధులు ఇస్తామని హామీ నేపథ్యంలో నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరబోతున్నారు.

సముద్రం కోత..

ఉప్పాడ వద్ద సముద్రం అంతకంతకూ ముందుకు వస్తూ కలవరపెడుతోంది. ఇప్పటి వరకు సముద్రగర్భంలో 1,360 ఎకరాలు కలిసిపోయింది. ఈ నేపథ్యంలో కోతను నివారిస్తామని ఎన్నికలప్పుడు కూటమి హామీ ఇచ్చింది. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత పవన్ కల్యాణ్ స్వయంగా కోతను పరిశీలించారు. ఎన్‌సీఆర్‌సీ శాస్త్రవేత్తలతో ప్రత్యేక అధ్య యనం చేయించారు.కోత నివారణకు ప్రత్యేక కాంక్రీట్‌గోడ నిర్మించాలని వీరు తేల్చారు. 12 కిలోమీటర్ల మేర ఈ కోత నివారణ ప్రణాళికకు రూ.250 కోట్ల వరకు వ్యయం అవుతుందని అంచనావేశారు. ఈ నేపథ్యంలో కోత నివారణ పనులు ప్రారంభించడానికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ తన నివేదికలో ప్రస్తావించారు.ఇప్పటికే కేంద్రం సైతం నిధులు ఇవ్వడానికి దాదాపు నిర్ణయానికి వచ్చింది. దీంతో ఆ ప్రతిపాదనలు వేగంగా కదిలేలా సీఎంకు విన్నవించనున్నారు.

జిల్లాలో ఎరువుల కొరతలేదు

- కావాల్సిన ఎరువులు సరఫరా అవుతున్నాయి
- కృత్రిమ కొరత సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం
- దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ఎరువుల సరఫరా అవుతున్నాయని, ఎలాంటి కొరత లేదని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సరిపడా ఎరువులు ఎప్పటికప్పుడు సరఫరా అవుతున్నాయన్నారు. జిల్లాలో యూరియా 3397 మెట్రిక్ టన్నులు, డీఏపీ 1377 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 1000 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 5874 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1407 మెట్రిక్ టన్నులు ఉన్నాయన్నారు. మొత్తంగా 13055 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలో రైతులందరికీ ఎరువులు సరఫరా అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగాన్ని అరికట్టాలన్నారు. అలాగే మోతాదుకు మించి ఎరువుల వినియోగం జరగకుండా వ్యవసాయశాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఎరువుల అక్రమ రవాణా చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఎవరైనా ఎరువుల డీలర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు.





గ్యాస్ లీకై వస్తున్న మంటలు, లీకైన ప్రాంతంలో కాలిపోయిన మడ అడవి

ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

40 అడుగుల మేర ఎగిసిపడిన మంటలు

ఆహుతైన మడ అడవులు

7

లగేజీ తగ్గాలి!

రైలు ప్రయాణికులకు లగేజీ పరిమితులు కత్తిరింపు



- ప్రధాన రైల్వే స్టేషన్లలో అమలు
- లగేజీని విభజించిన రైల్వే శాఖ

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజల సుదూర ప్రయాణానికి రైళ్ళు మాత్రమే మార్గం. ఆ ప్రయాణికులు రైళ్లలో లగేజీని తీసుకెళ్లేందుకు నిర్దిష్ట పరిమితిలో కోతలు విధించింది. ఈ మేరకు గత బుధవారం పార్లమెంట్‌లో ప్రత్యేక బిల్లు ఆమోదించింది. తొలివిడతగా దేశంలోని కొన్ని ప్రధాన రైల్వే స్టేషన్లలో అమలు చేయనున్నట్టు ప్రకటించినా తదుపరి దేశవ్యాప్తంగా అన్ని రైల్వే స్టేషన్లలోనూ నూతన నిబంధనలు అమలుచేయనున్నారు. సహజంగా రైళ్లలో ప్రయాణికులు ఎంతమేర లగేజీని తమ వెంట తీసుకెళ్లవచ్చు, నిర్దిష్ట పరిమాణంలోకన్నా ఎక్కువ లగేజీ ఉంటే ఏమి జరుగుతుంది అనే విషయాలు రైళ్ళల్లో ప్రయాణించే ప్రయాణికులందరికీ తెలియదు. చాలామంది ప్రయాణికులు నిబంధనలకు మించి లగేజీ తీసుకెళ్తారు.

ఎంతమేర లగేజీని తీసుకెళ్లవచ్చు

- రైలులోని మొదటి ఏసీ కోచ్‌లో ప్రయాణిస్తే 70 కిలోల బరువు ఉన్న లగేజీని తీసుకెళ్ల వచ్చు. అంతకంటే ఎక్కువ లగేజీతో రైలులో ప్రయాణించాలంటే రిజర్వేషన్ చేయించుకోవాలి.
- రైలులోని థర్డ్ ఏసీలో ప్రయాణిస్తే 40 కిలోల లగేజీ తీసుకెళ్లవచ్చు. సెకండ్ ఏసీలో ఈ పరిమితిని 50 కిలోలుగా నిర్ణయించారు.
- స్లీపర్ క్లాస్‌లో ప్రయాణించే ప్రయాణీకుడు 40 కిలోల వరకూ లగేజీని తీసుకెళ్లవచ్చు. మీరు ఇంతకంటే ఎక్కువ లగేజీతో ప్రయాణిస్తే రైల్వే నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తారు.



- భారతీయ రైల్వే నిబంధనల ప్రకారం మీరు 40 నుంచి 70 కిలోల వరకూ బరువున్న లగేజీ తీసుకెళ్లవచ్చు. ఇందులో ఏయే క్లాస్ బోగీల్లో ప్రయాణిస్తున్నారనే దానిపై ఆధారపడి ఉంటుంది.

కొత్తగా లగేజీ చెకింగ్ నిబంధనలు

- ఫస్ట్ క్లాస్ ఏసీ బోగీలలో ప్రయాణీకుడికి తనవెంట 70 కిలోల లగేజీని అనుమతిస్తారు
- సెకండ్ ఏసీ బోగీలలో ప్రయాణికునికి తన వెంట 50 కిలోల వరకూ లగేజీని అనుమతిస్తారు.
- థర్డ్ ఏసీ బోగీలలో ప్రయాణీకునికి తనవెంట 40 కిలోల వరకూ లగేజీని అనుమతిస్తారు. స్లీపర్ క్లాస్ బోగీలలో ప్రయాణికుడికి 40 కిలోల వరకూ లగేజీని అనుమతిస్తారు.
- సెకండ్ క్లాస్ బోగీలలో ప్రయాణికునికి 35 కిలోల లగేజీని మాత్రమే అనుమతిస్తారు.

విమానాల్లో లగేజీ ఇలా..

సాధారణంగా ఎయిర్‌లైన్ బ్యాగేజీ పరిమితులు విమానయాన సంస్థను బట్టి మారుతూ ఉంటాయి. ఇందులో తరచుగా ప్రయాణించే వారు, రూట్‌లు, చార్జీలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. ఎయిరిండియా కోసం ఎకానమీ క్లాస్ ప్రయాణీకుడు 15-25 కిలోల బరువున్న లగేజీని తీసుకెళ్ళవచ్చు. బిజినెస్, ఫస్ట్ క్లాస్ ప్రయాణికుడు 35 కిలోల వరకూ లగేజీని తీసుకెళ్లవచ్చు. నూతనంగా అమలుచేయనున్న నిబంధనల ప్రకారం సెకండ్ క్లాస్ బోగీలలో ప్రయాణించేవారికి ఒక్కొక్కరికీ 35 కిలోల లగేజీని మాత్రమే అనుమతిస్తూ గత పరి మితిలో కోత విధించారు.



ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

క్రీడాస్ఫూర్తి అలవర్చుకుని క్రీడల్లో రాణించండి

ఎమ్మెల్యే కొండబాబు

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని క్రీడల్లో రాణించాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. ఆగస్టు 29 ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆదేశాల మేరకు జిల్లా క్రీడామండలి ఆధ్వర్యంలో ధ్యాన్‌చంద్ ఛాంపియన్ షిప్ పోటీలు శుక్రవారం డీఎస్ఏ మైదానంలో ఘనంగా ప్రారంభించారు. పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కొండబాబు ముఖ్యఅతిథిగా, శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ గౌరవ అతిథిగా విచ్చేశారు. ముందుగా క్రీడా మైదానంలోని ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి డీఎస్‌డీవోబీ శ్రీనివాస్‌కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహించుకోవడం గర్వకారణమన్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు తమ ప్రతిభను కనపరిచి తమ తమ జిల్లాలకు మంచి పేరు తేవాలన్నారు. శాప్ డైరెక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తి ప్రధానమన్నారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ చేసి క్రీడావందనం నిర్వహించారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాక్సింగ్, బాస్కెట్బాల్, బ్యాడ్మింటన్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. తూర్పు, కాకినాడ, కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య కార్యదర్శి ఎల్. జార్జి, పీడీలు పాల్గొన్నారు.

అవినీతి వ్యవహారంపై విచారణకు ఆదేశం

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపాల్టీ పరిధిలో టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ సెక్షన్‌లలో 2022 ఆగస్టు 4, 5 తేదీల్లో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో అయిదు వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయాల సిబ్బంది పలు అవకతవకలకు పాల్పడినట్టు నిర్ధారణ కాకు వచ్చింది. దీంతో 30 మందిపై చర్యలు కోరుతూ సమగ్ర విచారణ చేయాలని ఆదేశించింది. అప్పట్లో సచివాలయాల అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నిర్వహించిన విచారణలో పలు రికార్డులను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈమేరకు రాష్ట్ర మున్సిపల్ ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ జీవో నంబరు ఆర్‌టీ 856 పేరిట ఉత్తర్వులు జారీ చేశారు. పూర్తి వివరాలకు సామర్లకోట మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా, సీఎం పర్యటన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు.

ఎంపికైన అభ్యర్థులు పరేడ్ గ్రౌండ్‌లో హాజరుకావాలి

కాకినాడ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లుగా ఎంపికైన స్త్రీ, పురుష అభ్యర్థులు ఈనెల 25న కాకినాడ ఆర్మ్‌డ్, రిజర్వుడు పరేడ్ గ్రౌండ్‌లో ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని ఎస్పీ జి.బిందుమాధవ్ శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సెలక్షన్ ప్రక్రియలో దరఖాస్తులతో జతపర్చిన ధ్రువీకరణ పత్రాలన్నీ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని రావాలన్నారు. అలాగే ధ్రువీకరణ పత్రాలన్నీ గెజిటెడ్ అధికారితో అటస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలను, ఇటీవల తీయించిన మూడు పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫోటోలతో తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే ఫిర్యాదు చేయండి

కలెక్టరేట్(కాకినాడ),ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే రైతులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఫిర్యాదు చేయాలని ఆ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఒక ప్రకటన వారు విడుదల చేశారు. వ్యవసాయోత్పత్తి పెంపుదలలో యూరియా కీలకపాత్ర పోషిస్తుందని, అలాంటి యూరియాను అక్రమంగా నిల్వ చేయడం చట్టవిరుద్ధమేనని పేర్కొన్నారు. జిల్లాలో గోదాములు, హోల్‌సేల్ డీలర్లు, రిటైల్ దుకాణాల్లో విజిలెన్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. యూరియా అక్రమ నిల్వ చేసినా, దారి మళ్లించినా ఆ సమాచారాన్ని విజిలెన్స్ కార్యాలయానికి ఫిర్యాదు చేయాలని అధికారులు కోరారు. ప్రభుత్వ నియమాల ప్రకారం నిల్వలు, పంపిణీ జరుగుతున్నాయా లేదా అన్న దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఈ రకమైన అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



కంటిచూపుతో ల్యాప్‌టాప్‌ను పనిచేయిస్తున్న అనిల్‌బాబు

చేతులు లేవని కలత చెందవద్దు...

కంటిచూపుతో కంప్యూటర్, ల్యాప్‌ట్యాప్‌లతో అద్భుతాలు సృష్టించ వచ్చు. చేతులు లేవని పరీక్ష రాయడానికి మరో వ్యక్తి అవసరం కూడా లేదు. అదే కంటిచూపుతో పరీక్ష రాయవచ్చు. కాళ్లు, చేతులు లేకపోయినాస్విచ్‌లతో పని లేకుండా కంటిచూపుతోనే ఇంట్లోని అన్ని రకాల ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులను వినియోగించుకోవచ్చు. ఇందుకోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన పూజారి అనిల్‌బాబు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ డిజైన్ చేశాడు. ఒక్కసారి ఆ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే చాలు దివ్యాంగులు తమ కంటిచూపుతోనే ఎన్నో పనులు చేయవచ్చు. అంతేకాదు. కంప్యూటర్ నాలెడ్జ్ పెంపొందించుకుని సాధారణ కుటుంబ అవసరాలకు తగ్గ ఆదాయం కూడా సంపాదించుకోవచ్చంటున్నాడు.

అన్నీ కంటిచూపుతోనే...

దివ్యాంగులకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించిన అమలాపురం విద్యార్థి పూజారి అనిల్‌బాబు

అమలాపురం టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం రూరల్ మండలం భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో పూజారి అనిల్‌బాబు పాలిటెక్నిక్ సీఎంఈ గ్రూపులో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ తండ్రి అతడి చిన్నతనంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తల్లి మంగ ఎంతో కష్టపడి కుమారుడిని చదివించింది. కంప్యూటర్ విద్యపై ఉన్న మక్కువను గుర్తించి అప్పు చేసి మరీ ల్యాప్‌టాప్ కొనిచ్చింది. అప్పటివరకు సెల్‌ఫోన్‌లో ఎన్నో అద్భుతాలు సృష్టించిన అనిల్ ల్యాప్‌టాప్ రావడంతో రెండేళ్ల కాలంలో పలు నూతన అద్భుతాలను ఆవిష్కరించాడు.

'హెల్ప్ టు డిజైబుల్ పీపుల్'కు ప్రథమ స్థానం

దివ్యాంగులు ఏ ఒక్కరి మీద ఆధారపడకుండా స్వశక్తితో తమ పనులు చేసుకునేలా చేయాలన్న సంకల్పంతో అనిల్‌బాబు హెల్ప్ టూ డిజైబుల్ పీపుల్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాడు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించాడు. దాని ఆధారంగా కంటిచూపుతోనే ల్యాప్‌ట్యాప్, కంప్యూటర్లను పూర్తిస్థాయిలో దివ్యాంగులు వినియోగించుకోవచ్చు. కంటిచూపుతోనే ఫేస్‌బుక్, వాట్సాప్‌లను ఓపెన్ చేయడంతో పాటు యూట్యూబ్‌లో ఏమైనా చూడవచ్చు.

- అక్కడితో ఆగకుండా చేతులు లేనివారు కంటిచూపుతో పరీక్ష రాసే సాఫ్ట్‌వేర్‌ను కూడా రూపొందించాడు. ల్యాప్‌టాప్‌లో కనులు చూసే అక్షరాలు వరుసక్రమంలోకి వచ్చేస్తాయి. దాంతో కేటాయించిన సమయంలో పరీక్ష రాసే అవకాశం కల్పించాడు.
- ఇక దివ్యాంగులు ఇంట్లో ఫ్యాన్లు తిరగడానికి, లైట్లు వెలిగించడానికి, చివరికి టీవీ చూడడంతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలు అన్నింటినీ కంటిచూపుతోనే ఆపరేట్ చేసే సాఫ్ట్‌వేర్ అందరితో ఔరా అనిపించింది.
- వీల్‌చైర్‌కు పరిమితమైన దివ్యాంగుడు బాత్‌రూమ్‌కు వెళ్లాలన్నా, కుడివైపునకు, ఎడమ వైపునకు తిరగాలన్నా కంటిచూపుతో తిరిగేలా సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశాడు.
- దివ్యాంగులు ఏ ఒక్కరి మీద ఆధారపడకుండా ఉండాలని అందుకే వారి కోసం ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు అనిల్‌బాబు తెలిపాడు. ఈ సాఫ్ట్‌వేర్ జాతీయ స్థాయి ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించింది.



సాఫ్ట్‌వేర్ రూప శిల్పి అనిల్‌బాబు (పైన)



అతడిని అభినందిస్తున్న మంత్రి లోకేశ్ (కింద)



ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌లో రూ.1.25 లక్షలు నగదు బహుమతి

భవానీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఈ నెల 21న ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025 కార్యక్రమం నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థులు 135 ప్రాజెక్టులతో సమ్మిట్‌లో పాల్గొన్నారు. డిప్లొమా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనకు వెళ్లేందుకు అనిల్‌కు దారి ఖర్చులు కూడా లేని పరిస్థితుల్లో ఒకరు చేయి అందించి ముందుకు పంపించారు. విద్యార్థులు ఎన్నో నూతన ఆవిష్కరణలతో 135 ప్రాజెక్టులతో సమ్మిట్‌లో పాల్గొన్నప్పటికీ అనిల్ రూపొందించిన 'హెల్ప్ టు డిజైబుల్ ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలిచింది. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రముఖుల ద్వారా రూ.1.25లక్షల విలువైన చెక్కు అందుకున్నాడు. సమ్మిట్‌లో పాల్గొన్న టాటా ఇన్నోవేషన్ ప్రతినిధుల దృష్టి అనిల్‌పై పడింది. 2024 డిసెంబరు 4న కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు జాతీయస్థాయిలో ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించారు. అందులో అనిల్ రూపొందించిన డిజైబుల్ పీపుల్ ప్రాజెక్టుకే ప్రథమ స్థానం లభించగా రూ.25వేలు నగదు బహుమతి అందించారు. అత్యుత్తమ ఆవిష్కరణలు చేసిన విద్యార్థులను ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అమరావతి రప్పించుకున్నారు. అనిల్‌బాబును, అతను రూపొందించిన ప్రాజెక్టులను లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. వినూత్నప్రాజెక్టుల రూపకల్పనలో ప్రభుత్వం తమ వంతు సాయం అందిస్తుందని ప్రకటించారు. అనిల్‌ను బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఆర్డీవో కె.మాధవి అభినందించారు. దొంగ ఓట్లను అరికట్టేందుకు 'అనిల్ ఓటింగ్ సిస్టమ్'ను అనిల్‌బాబు ఇప్పటికే రూపొందించాడు. సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఫైనల్ స్థాయికి తీసుకెళ్తున్నానని వెల్లడించాడు. భవిష్యత్తులో దొంగ ఓట్లను అరికట్టేందుకు ఈ సాఫ్ట్‌వేర్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పాడు.

సుమంత్ ఆఫీసు పనిపై హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. అయితే బస్ టికెట్ కోసం మన మిత్ర బస్‌ను ఆశ్రయించాడు. క్షణాల్లో ఆర్టీసీ బస్ టికెట్ బుక్ చేసుకున్నాడు. గతంలో ఇలా ఉండేది కాదు... ప్రైవేటు బస్సు ఏజెన్సీలను ఆశ్రయించాల్సి వచ్చేది.



శ్రీదేవి తన ఇద్దరి పిల్లలకు 'తల్లికి వందనం' డబ్బులు తన ఖాతాలో పడ్డాయో లేదో తెలుసుకునేందుకు పలుమార్లు బ్యాంకులకు వెళ్లేది. బ్యాంకు సిబ్బంది ఒక వారంలో పడొచ్చు అని చెప్పేవారు. అయితే పదేపదే బ్యాంకుల చుట్టూ తిరిగే ఓపిక లేని శ్రీదేవి తన మొబైల్‌లో మన మిత్ర వాట్సాప్ నంబర్ సేవ్ చేసుకుని హాయ్ అని టైపు చేసింది. సేవలను ఎంచుకోండి అంటూ రిప్లై మెసేజ్ రావడం, అందులో తల్లికి వందనం సేవల ఆప్షన్ కనిపించడంతో దానిపై క్లిక్ చేసింది. ఆ తర్వాత ఆమె ఆధార్ నంబర్ నమోదు చేయాలని చూపడంతో ఆమె తన ఆధార్ ఎంటర్ చేసింది. వెంటనే తల్లికి వందనానికి సంబంధించిన రూ.26వేలు ఆమె ఖాతాలో జమ అయినట్టుగా మెసేజ్ వచ్చింది.

చూశారా.. సుమంత్, శ్రీదేవిలాంటి వారే కాదు.. ఇలా ఎందరో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకుంటున్నారు.

అన్నీ ఈ యాప్‌లోనే...

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా వాటిని ఇంటి నుంచే పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చింది. 'మన మిత్ర' పేరిట అమలవుతోన్న ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సేవలు పొందేందుకు, ఫిర్యాదులు చేసేందుకు సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ-పౌర సేవలు అందిస్తున్న ప్రభుత్వం వాటిని 700కు పెంచాలని నిర్ణయించింది.

ఈ ఏడాది జనవరిలో 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన 161 సేవలతో 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభమైంది. తర్వాత సేవలను క్రమంగా పెంచుతూ.. ప్రస్తుతం ఆ సంఖ్య 500కు చేరింది.

- ప్రజా సేవలో.. 'మన మిత్ర'
- 26 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 161 సేవలతో ప్రారంభం
- ప్రస్తుతం ప్రజలకు అందుబాటులో 500 సేవలు




ఏయే సేవలు అందుబాటులో అంటే..

- విద్యార్థులకు పరీక్షల హాల్ టికెట్లు, రేషన్ కార్డుల సేవలు, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ స్టేటస్‌లు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి.
- పౌరులు ఒక్క క్లిక్‌తో లైసెన్సులు, పన్నులు, బిల్లులు చెల్లించవచ్చు.
- ఆలయాల దర్శనాల బుకింగ్, ఆర్టీసీ టికెట్ బుకింగ్ వివరాలు, పరీక్షల ఫలితాల ఇంటి వద్ద నుంచే తెలుసుకునే అవకాశం కల్పించారు.
- అన్ని శాఖల డేటాను ఆర్టీజీఎస్‌తో ప్రభుత్వం అనుసంధానం చేసింది. ప్రతి ఒక్కరి వ్యక్తిగత సమాచారం ప్రభుత్వం వద్ద ఉంది. దీనిని శాఖల వారీగా 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్‌కు అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్‌తో ధ్రువపత్రాలు, ఇతర పౌర సేవలు పొందవచ్చు. భవిష్యత్తులో క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా నకిలీ, అసలు గుర్తించే సౌలభ్యం అందుబాటులోకి రానుంది.

ఇవి కూడా...

వ్యవసాయ పథకాలు, అన్నా క్యాంటీన్, ఏపీఈడీబీ సేవలు, ఏపీఎస్‌ఎస్‌డీసీ, పురపాలక, విద్య, ఎనర్జీ సేవలు (బిల్లుల చెల్లింపు, ఫిర్యాదులు), హెల్త్ కార్డు, పరిశ్రమలు, జైలు సేవలు, జీరో పావర్టీ పీ4 సేవలు, పంచాయతీరాజ్, ఎన్టీఆర్ భరోసా పింఛను పథకం, పోలీసు శాఖ, రెవెన్యూ, మైన్స్, భౌగోళిక సేవలు, క్రీడా ప్రాధికారం, సివిల్ సప్లయిస్, తల్లికి వందనం, టీటీడీ, దేవాలయాల సేవలు, మహిళా, శిశు సంక్షేమ సేవలను ఎంచుకోవచ్చు. వాటి వివరాలను తెలుసుకుని, ఆ సేవలను వినియోగించుకోవచ్చు.




ఇలా చేయాలి...

ప్రభుత్వ వాట్సాప్ నెంబరు 95523 00009ను 'మన మిత్ర' పేరిట మొబైల్‌లో నమోదు చేసుకోవాలి. దానికి హాయ్ అని సందేశం పంపాలి. వెంటనే ఏపీ ప్రభుత్వ లోగోతో రిప్లై మెసేజ్ వస్తుంది. తద్వారా మీకు కావాల్సిన సేవను ఎంపిక చేసుకోవాలి. వెంటనే మీకు వాట్సాప్‌లో ఏఐ ఆధారిత చాట్‌బాక్స్‌లో లభ్యమయ్యే అన్ని ప్రభుత్వ సేవల జాబితా కనిపిస్తుంది. అందులో మీకు కావల్సిన సేవలను ఎంపిక చేసుకోవచ్చు. వాయిస్ కమాండ్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. మీరు కోరుకున్న సేవకు సంబంధించి చాట్ బాక్స్ మరికొన్ని అదనపు వివరాలు అడగవచ్చు. మీ ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు లేదా సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ లాంటివి. మీరిచ్చిన వివరాలను ఒక్కసారి తనిఖీ చేసి, తర్వాత అందులో సిస్టం మీకు రియల్ టైం అప్‌డేట్స్ ద్వారా ఒక కన్ఫర్మేషన్ మెసేజ్ పంపుతుంది. చెల్లింపుల కోసం భద్రతతో కూడిన ఒక పేమెంట్ లింక్ పంపుతుంది. మీరు జరిపిన లావాదేవీలకు సంబంధించి డిజిటల్ కాపీ లేదా రసీదును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాట్ బాక్స్‌లో ధ్రువీకరణ పత్రాలు, రసీదులు లేదా ఎక్‌నాలెడ్జ్‌మెంట్ రూపొందించి మీకు అందిస్తుంది.

నేడు పెద్దాపురానికి సీఎం చంద్రబాబు

పర్యటన ఇలా..



సామర్లకోట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శనివారం కాకినాడ జిల్లా పెద్దాపురం, సామర్లకోటలలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తల సమావేశం, ప్రజావేదిక సదస్సు, పీ4 సదస్సు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు పర్యటన షెడ్యూల్‌ను సీఎం వ్యక్తిగత కార్యదర్శి ఆర్.కృష్ణకపర్ది జారీ చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధ అధికారి కార్యాలయం నుంచి శుక్రవారం పాత్రికేయులకు విడుదల చేశారు.

- శనివారం ఉదయం 10.10 గంటలకు ఉండవిల్లిలోని సీఎం చంద్రబాబు స్వగృహం నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరతారు.
- 11.00 గంటలకు పెద్దాపురం రోడ్లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుని 10 నిమిషాల పాటు జిల్లా అధికారులను, ప్రజా ప్రతినిధులను, ప్రజలను కలుస్తారు.
- 11.20 గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో పెద్దాపురం మున్సిపాల్టీలోని పదో వార్డుకు చేరుకుంటారు.
- 11.20 నుంచి 12.00 గంటల వరకూ అక్కడ నిర్మించిన మేజిక్ డ్రైన్ సందర్శన, స్వచ్ఛ రథాల సందర్శన, పారిశుధ్య సిబ్బందికి బీమా సదుపాయం ప్యాకేజీ ప్రారంభ కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు.
- 12.00 గంటల నుంచి స్వచ్ఛత ర్యాలీని ప్రారంభించి పాల్గొంటారు.
- 12.25 గంటలకు పెద్దాపురం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారు.
- 12.30 గంటలకు ముఖ్యమంత్రి ప్రజావేదిక సదస్సుకు చేరుకుని 1.00 గంట వరకూ రిజర్వ్‌డ్‌గా ఉంటారు.
- మధ్యాహ్నం 1.00 గంటల నుంచి 2.40 గంటల వరకూ అక్కడ ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను సీఎం సందర్శిస్తారు. అనంతరం ప్రజావేదిక సదస్సులో పాల్గొంటారు.
- 2.40 గంటల నుంచి 2.45 గంటల వరకూ వివిధ వర్గాలకు చెందిన సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లతో ముమేకం అవుతారు.
- 2.50 గంటలకు సామర్లకోట పూర్ణ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన టీడీపీ కార్యకర్తల సమావేశానికి హాజరూ 3.50 గంటల వరకూ సమావేశంలో పాల్గొంటారు.
- 3.50 గంటలకు కళ్యాణ మండపం నుంచి ప్రత్యేక వాహనాల్లో పెద్దాపురంలో హెలీప్యాడ్‌కు 3.55 గంటలకు చేరుతారు.
- 3.55 గంటల నుంచి 4.40 గంటల వరకూ రిజర్వ్‌డ్‌గా ఉంటారు.
- 4.40 గంటలకు హెలీకాప్టర్‌లో అమరావతికి బయలుదేరతారు.
- 5.30 గంటలకు ఉండవల్లిలోని సీఎం స్వగృహంలోని హెలీప్యాడ్‌కు చేరుతారు.

శ్రీపాదశ్రీవల్లభుడికి సహస్ర చామంతి పూజ



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానంలో జరుగుతున్న శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. సహస్ర చామంతి పూజ నిర్వహించారు. శ్రీపాదుని దివ్య పాదపద్మాలకు ఏకాదశ రుద్రాభిషేకం, దత్త హోమం జరిగాయి. శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులను పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా ఈవో ఆర్.సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కబళించిన మృత్యువు

- గుడ్డిగూడెంలో ట్రాక్టర్ బోల్తా
- ఓ మహిళ మృతి
- మరో ఇద్దరికి తీవ్ర, ఐదుగురికి స్వల్ప గాయాలు





బోల్తా పడిన ట్రాక్టర్, పద్మ(ఫైల్)

గోపాలపురం, 22(ఆంధ్రజ్యోతి): కూలినాలి చేసుకుని వచ్చిన కష్టంతో కుటుంబాల్ని పోషించుకుందామనుకున్న ఆ మహిళను మృత్యువు ప్రమాద రూపంలో కబలించింది. రోజువారి పనుల్లో భాగంగా కూలి పనికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి భర్త, బిడ్డలకు వంట చేసి పెట్టాలనే ఆలోచనతో ట్రాక్టర్‌పై వస్తున్న మహిళ ట్రాక్టర్ తిరగబడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుడ్డిగూడెం గ్రామానికి చెందిన సుగ్గనబోయిన పద్మ(40) తనతోపాటు మరో ఏడుగురు మహిళలు కలిసి రోజువారి క్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ట్రాక్టర్‌పై కూలిపనికి వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు తిరగబడడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తనతో పాటు ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ మనోహర్, దేవరపల్లి సీఐ నాగేశ్వరనాయక్‌లు పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయాల్సి ఉంది.

బీసీ హాస్టళ్లలో మెరుగైన విద్యనందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

- బీసీ సంక్షేమశాఖ ఎక్స్‌అఫీషియో సెక్రటరీ సత్యనారాయణ
- ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల బీసీ వెల్ఫేర్ అధికారులు, హెచ్‌డబ్ల్యువోలతో సమీక్ష

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మంచి ఆహారం అందించేవిధంగా చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ ఎస్.సత్యనారాయణ అన్నారు. సెప్టెంబరు 5 నాటికి రాష్ట్రంలోని వసతి గృహాల్లో 244 మంది నాలుగో తరగతి సిబ్బందిని నియమించనున్నట్టు తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు, హెచ్‌డబ్ల్యువోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సంక్షేమశాఖలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారుల పనితీరు మెరుగుపర్చుకునేందుకు, వారి పనితీరు తెలుసుకోవడానికి నూతన విధానాన్ని తీసుకొచ్చామన్నారు. విధి నిర్వహణను బట్టి కొన్ని మార్కులు కేటాయిస్తామన్నారు. బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా వెల్ఫేర్ అధికారులు కలెక్టర్లను సంప్రదించి వసతి గృహాల్లో ఉన్న సమస్యలను తెలియజేసి వారి నుంచి నిధులు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడు నెలలకు ఒకసారి జిల్లాలో సమీక్ష నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీసీ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ డీసీఎస్ రాజు, ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ పి.మాధవీలత, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారులు బి.శశాంక, సత్యరమేష్, వెంకటేశ్వరరావు, ఏబీసీ డబ్ల్యువోలు ముత్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా దత్తు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన సీనియర్ నాయకుడు బొమ్ముల దత్తును నియమిస్తూ పార్టీ రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.దత్తు గతంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా చేశారు. ఆ తర్వాత ఎలాంటి పదవి దక్కలేదు. అయినా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గానే పాల్గొనేవారు. అలాగే బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్ష పదవి మరోసారి రొంగల గోపిశ్రీనివాస్‌కు దక్కింది.

యోగా కోర్సులకు దరఖాస్తుల గడువు పెంపు

దివాన్‌చెరువు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తిరామ యోగా సంస్థలో పీజీ డిప్లమో ఇన్ యోగ, యోగా సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాలకు ఈనెల29 వరకూ గడువు పొడిగించామని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్సైట్‌ను లేదా 73823 08440 నెంబరును సంప్రదించాలన్నారు. కౌన్సెలింగ్ ప్రకియ విశ్వవిద్యాలయం ప్రవేశాల డైరెక్టర్ ఆచార్య పి.ఉమామహేశ్వరీదేవి నిర్వహిస్తారన్నారు.

సదస్సు లక్ష్యాలను సమాజంలోకి తీసుకెళ్లాలి



సదస్సులో సర్టిఫికెట్లు అందుకున్న పరిశోధకులు

నన్నయలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

దివాన్‌చెరువు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సదస్సులోని కీలక విషయాలను, లక్ష్యాలను సమాజంలోకి తీసుకు వెళ్లాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యాకళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్బారావు అన్నారు. నన్నయ వర్సిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది.. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సుబ్బారావు మాట్లాడుతూ సదస్సుకు సంబంధించిన అంశాలపై 65 మంది పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. అందులో 40 ఉత్తమ పరిశోధన పత్రాలతో పుస్తకాన్ని ముద్రించామన్నారు. సదస్సు కన్వీనర్ ఆర్ఎస్ వరహాలదొర మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మంది గిరిజనులు ఉన్న దేశాలలో భారత్ రెండో స్థానంలో ఉందన్నారు. గిరిజన థింసా నృత్యం అందరూ ఐక్యతగా ఉన్నారనే సంకేతాన్ని సుఖదుఃఖాలను సమానంగా ఇస్తుందన్నారు. ముగింపు సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 23 మంది పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు మంత్రి మదన్‌మోహన్ చేసిన నృత్యప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం పరిశోధకులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఆర్.సాంబశివరావు, ఎం.గోపాలకృష్ణ, జి.ఎలీషాబాబు, జె.రాజమణి, వి.రామకృష్ణ, ఎస్.సుజాత, కె.ఎస్.ఆర్.రాజేశ్వరీదేవి పాల్గొన్నారు.



మదన్‌మోహన్ నృత్యప్రదర్శన

ముంపులోనే కోనసీమ

వరద నీటిలో లంక గ్రామాలు

ఆందోళనలో రైతులు

అలమూరు/పి.గన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి కారణంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పలు గ్రామాల్లో ఇంకా ముంపు నీటిలోనే ఉండిపోయాయి. ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం వద్ద ఇటీవల నిర్మించిన కాజ్‌వే గోదావరి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అధికారులు కాజ్‌వేను పరిశీలించి తోకలంకకు రాకపోకలు సాగించే విధంగా నాటుపడవలు ఉండడంతో తగుజాగ్రతలు తీసుకోవాలని సూచించారు. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలకు వరదనీరు చేరుకుంది. అలాగే పి.గన్నవరం మండలంలోని బూరుగులంక నదీపాయ ఉధృతంగా ప్రవహించడంతో హైలాండ్‌పై ఉన్న ఉడిమూడిలంక, పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనకాయలంక కాజ్‌వే పూర్తిగా జలదిబ్బంధంలో ఉండడంతో లంక గ్రామంలోని ప్రజలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యసాయ ఉత్పత్తులు సైతం పడవలపైనే ఇవతలి ఒడ్డుకు చేర్చుకుంటున్నారు. అలాగే జిల్లాలోని పలుగ్రామాల్లో ఉద్యానపంటలు ముంపులో ఉన్నాయి. దీంతో తమకు నష్టం తప్పదని రైతులు ఆవేదన చెందుతున్నారు.


అంతర్వేది: వరద నీటితో మునిగిసిన సఖినేటిపల్లి వంతెన


కూనవరం – వరరామచంద్రపురం మండలాల నడుమ శబరి, గోదావరి నది సంగమం


కోటిపల్లిలో మత్స్యకార కాలనీలోకి చేరిన వరద నీరు


పి.గన్నవరం మండలం గంటిపెదపూడి ఏటిగట్టు దిగువున వరదనీటిలో రైతుల కష్టాలు


ఐ.పోలవరంలో ఎదుర్లంక బ్రిడ్జి వద్ద వరద


పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వద్ద పడవపై రాకపోకలు, ఉడిమూడి ఏటిగట్టు దిగువున వరద నీటిలో నివాసాలు




ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలో మునిగిన పూరిపాకలు

చింతూరులో తగ్గని ఉధృతి

చింతూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు డివిజనులో శబరి, గోదావరి ఉధృతి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం ఉదయం 4 గంటలకు 50.10 అడుగుల మేర ప్రవహించి సాయంత్రం 6 గంటలకు 43.90 అడుగులకు చేరుకుంది. సాయంత్రం 6 గంటలకు చింతూరు వద్ద శబరి 38 అడుగులు, కూనవరం వద్ద గోదావరి 49 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో వరద ఉధృతి యధాస్థితిగా ఉంది. దీంతో లోతట్టు వాసులు నిత్యావర వస్తువుల కోసం ఇక్కట్లు పడుతున్నారు. తమకు త్వరగా పరిహారం, పునరావాసం కల్పించి ఇక్కడ నుంచి తరలించాలని పోలవరం నిర్వాసితులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. కూనవరం మండలంలో పర్యటించిన అల్లూరి సీతారామరాజు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు బాధితులు తమ ఇబ్బందులపై మొరపెట్టుకున్నారు.

వరద ఉధృతిని పరిశీలించిన ఏలూరు రేంజ్ ఐజీ

ధవళేశ్వరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద ఉధృతిని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్, కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, రాజమహేంద్రవరం దక్షిణ మండలి డీఎస్పీ భవ్యకిషోర్‌తో కలిసి బ్యారేజ్‌పైకి చేరుకుని పరిశీలించారు. ఇరిగేషన్ జేఈ రాధాకృష్ణ వరద పరిస్థితిని వివరించారు. ధవళేశ్వరం సీఐ గణేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం శుక్రవారం రాత్రి 7 గంటలకు 14.20 అడుగులకు చేరుకోగా 13,48,226 క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తుంది.



కాటన్ బ్యారేజ్‌పై వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఐజీ

శ్రావణ లక్ష్మి నమోస్తుతే..


సత్యదేవుడి ఆలయంలో వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు


పాదగయలో శ్రావణ లక్ష్మి


వరలక్ష్మివ్రతం ఆచరిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు సతీమణి పద్మజ, మహిళలు

రత్నగిరిపై ఉచిత సామూహిక వరలక్ష్మి వత్రాలు

తరలివచ్చిన 10వేలమంది మహిళలు

అన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చివరి శ్రావణ శుక్రవారం కావడంతో కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఇందుకు విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి సుమారు 10 వేలమంది మహిళలు హాజరుకాగా 4ప్రత్యేక మండపాల్లో 3 బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు నిత్యకల్యాణమండపంలో ఈ వో వీర్ల సుబ్బారావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రా రంభించారు. ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను.. మరో వేదికపై వరలక్ష్మిదేవిని ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమం ప్రా రంభించారు. అమ్మవారికి విశేష పూజల అనంతరం మహిళలతో పసుపు, కుంకుమలతో అష్టోత్తరశతనామాలతో ఆచరింపచేశారు. అనంతరం వరలక్ష్మి వ్రతకథను శ్రావ్యంగా వివరించారు. మహిళలకు దేవస్థానం ఆ ధ్వర్యంలో అమ్మవారి రాగిప్రతిమ, రవికలవస్త్రం, ప్ర సాదం ప్యాకెట్టు ఉచితంగా పంపిణీ చేశారు. వ్రతం అనంతరం భక్తులకు ప్రత్యేకదర్శనం, ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. దశాబ్దంగా ఈ వ్రతాలు ప్రతీ ఏటా చేపడుతున్న ఈ ఏడాది విచ్చేసిన మహిళలు మునుపెన్నడూ రాలేదనే చెప్పాలి. ఉదయం 8 ప్రారంభమైన వ్రతాలు మధ్యాహ్నం 2గంటల వరకు నిరంతరాయంగా జరిగాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సిబ్బంది సమష్టి కృషితో కార్యక్రమం విజయవంతమైందని ఈవో పేర్కొన్నారు.


వరలక్ష్మి పూజా క్రతువు నిర్వహిస్తున్న పండితులు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈవో దంపతులు



పాదగయలో వైభవంగా వరలక్ష్మి వ్రతాలు

మహిళలకు పవన్ పంపిన 14వేల చీరల అందజేత

పిఠాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. అంబిక, భ్రమరాంబ, చాముండి, దుర్గ, ఈశ్వరి పేర్లతో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు 5 బ్యాచ్‌లుగా వ్రతాలు జరిపించారు. దత్తాత్రేయ మండపం, సరస్వతీదేవి మందిరం సహా ఆలయ ప్రాం గణంలో మహిళలు వ్రతాలు ఆచరించారు. వేదపండితులు, ఘనాపాఠీల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా శ్రావణ లక్ష్మికి పూజలు జరిగాయి. భక్తులకు కొబ్బరికాయ, గాజులు, పసుపు, కుంకు మ, అరటి పళ్లు, పువ్వులు, పూజా సామగ్రి, చీర, రవిక, వరలక్ష్మి రూపు, ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు. క్షేత్రంలో వస్తున్న సంప్రదాయం, అనవాయితీకి అనుగుణంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సమకూర్చారు. 14వేల చీరలను పవన్ సమకూర్చారు. వీటిని భక్తులకు జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగమణి సతీమణి కొణిదెల పద్మజ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. మహిళలతో పాటు పద్మజ వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.


చీరలు అందుకున్న మహిళలు

ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్

40 అడుగుల మేర ఎగిసిపడిన మంటలు

ఆహుతైన మడ అడవులు

యానాం/ఐ.పోలవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యానాం, కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలెం వద్ద సరిహద్దు ప్రాంతంలో సముద్రం నుంచి గోదావరి మీదుగా వెళ్లే ఓఎన్‌జీసీ గ్యాస్ పైప్‌లైన్ లీక్ అవ్వడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఒక్కసారిగా ఆకాశం ఎరుపెక్కింది. సుమారు 40అడుగుల మేర మంటలు ఎగిసిపడంతో స్థానికులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారు జామున 2.30గంటలకు జరిగిన ఈ సంఘటన అందరిని ఉలిక్కిపడేలా చేసింది. స్థానికులు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు ఫోన్లో సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఓఎన్‌జీసీ, యానాం పరిపాలనాధికారి, పోలీసులతో మాట్లాడి సంఘటన ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఓఎన్‌జీసీకి చెందిన సేఫ్టీ అధికారులు పైప్‌లైన్ నుంచి వచ్చే గ్యాస్‌ను సముద్రంలోనే వాల్ మూసివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఇటువంటి సంఘటనలు జరగకుండా ఉండాలంటే చమురు సంస్థల అధికారుల పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉండాలని మల్లాడి అన్నారు. సంఘటనా ప్రాంతం సమీపంలోని మడ అడవులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలు ఐలాండ్-3 పైప్ నుంచి ఐలాండ్-2 పైప్‌లైన్‌కు వ్యాపించడంతో సుమారు 3 కిలోమీటర్ల మేర చెట్లు, మొక్కలు కాలి బూడిదయ్యాయి. అయితే ప్రమాదం ఏ విధంగా జరిగిందే అనేది చమురుసంస్థలకు చెందిన అధికారులే తేల్చాసి ఉంది. ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గూటం శివగణేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్థాని దీనేష్, మెల్లం శ్రీనివాస్ బృందం సంఘటన ప్రాంతాన్ని సందర్శించారు. అర్థాని దినేష్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్షంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. గత సెప్టెంబరు 21న పైప్‌లైన్ లీక్ అయినప్పుడే చర్యలు తీసుకోవాలని కోరితే తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపట్టారని, అందువల్ల ఈరోజు ఈ పరిస్థితి వచ్చిందని ఇప్పటికైనా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గ్యాస్ పైప్‌లైన్ లీక్ అవ్వడం వల్ల చేపలు చనిపోతున్నాయని భైరవపాలెం, గాడిమొగ మత్స్యకారులు ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు విన్నవించారు.


గ్యాస్ లీకై వస్తున్న మంటలు, లీకైన ప్రాంతంలో పొంగుతున్న నీరు



పిచ్చి కుక్క స్వైర విహారం

ఏవీనగరంలో ఐదుగురికి తీవ్ర గాయాలు

తొండంగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీనగరం గ్రామంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. గ్రామానికి చెందిన మడికి పేరంటాలు (55), కొంజర్ల భవిష్(5), గొలుసు కృష్ణవేణి (30), సన్ని శివ(10), కుక్కా అభిరామ్ (5)ను కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. వారితో పాటు మరో రెండు గేదె దూడల్ని కూడా గాయపరిచింది. వారిని కరిచిన కుక్క గ్రామంలోని వీధుల్లో తిరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. మూకుమ్మడిగా దానిని పొలాల వైపు వెళ్లగొట్టారు. గ్రామంలోని పిల్లలు, వృద్ధులు భయానికి గురయ్యారు. గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను కట్టడి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీపీ యనమల కృష్ణ కోరారు.


పిచ్చికుక్క దాడిలో గాయపడ్డ బాలుడు

దేవదాయ శాఖలోనే శ్రీవారాహి అమ్మవారి ఆలయం

కాకినాడ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయాన్ని దేవదాయ, ధర్మదాయ శాఖ ఇటీవల స్వాధీనం చేసుకోవడంపై పూర్వపు ఆలయ నిర్వాహకురాలు కె.ప్రసన్నరాణి పద్మలక్ష్మి హైకోర్టులో కేసు వేశారు. అయితే పిటీషన్‌పై విచారించిన కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. శ్రీవారాహి అమ్మవారికి ప్రసన్నరాణి పద్మలక్ష్మి పూజలు మాత్రమే చేసుకోవచ్చని, ఆలయానికి సంబంధించిన ఇతర వ్యవహారాలన్నింటినీ దేవదాయ శాఖ చూసుకుంటుందని కోర్టు తీర్పులో పేర్కొన్నట్టు ఆలయ ఇన్‌చార్జి ఈవో ఆర్.సౌజన్య తెలిపారు. అదే విధంగా ఇప్పటి వరకూ ఆలయానికి వచ్చిన దాతల చందాలు, ఆదాయ, వ్యయాలకు సంబంధించిన బ్యాంకు రికార్డులను సమర్పించాలని కోర్టు ఆదేశించిందని ఈవో పేర్కొన్నారు.

ఇంట్లో 38 గ్రాముల బంగారం, నగదు చోరీ

అంబాజీపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు మలుపు శివారు రావులమ్మ పానాటంకు చెందిన మాదే ప్రసాద్ భార్య బేబికి అనారోగ్యం కారణంగా ఆమె కుమార్తె అనిత తల్లిని గురువారం అమలాపురంలో ఓ ఆసుపత్రికి తీసుకెళ్లింది. ఆసుపత్రిలో బేబిని చికిత్స నిమిత్తం ఉంచి శుక్రవారం ఉదయం అనిత ఇంటికి వచ్చింది. ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూడగా 38 గ్రాముల బంగారం, నగదు అపహరించుకుపోయిన్నట్టు గుర్తించింది. దీంతో అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.చిరంజీవి పేర్కొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న

కాకినాడ ఆర్డీవోకు తీవ్ర అస్వస్థత

ఆసుపత్రిలో చేరిక


సామర్లకోట ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో మల్లిబాబుకు చికిత్స నిర్వహిస్తున్న వైద్యులు

సామర్లకోట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సామర్లకోటలో సీఎం పర్యటన ఏర్పాట్లు పర్యవేక్షిస్తూ కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అమల, వరలక్ష్మి, కిరణ్ ప్రాథమిక చికిత్స నిర్వహించి శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో ప్రభుత్వ అంబులెన్స్‌లో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోటలో వివిధ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్‌తో పర్యవేక్షిస్తుండగా బీపీ లెవెల్స్ పడిపోవడం, షుగర్ లెవల్స్ కూడా తగ్గడంతో కళ్లు తిరుగుతున్నట్టు సిబ్బందికి తెలియజేశారు. దీంతో సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి ఆర్డీవో కారులో తీసుకువెళ్లగా తీవ్ర అస్వస్థతకు లోనై కుప్పకూలారు. సమాచారం తెలుసుకున్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సీఎం సభా ఏర్పాట్ల నుంచి సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి చేరుకుని వైద్యులతో ఆర్డీవో ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం అంబులెన్స్ వెంట కాకినాడ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను ఆదేశించారు. మరో 2 రోజుల వరకూ ఐసీయూలో ఉంచి చికిత్స నిర్వహించడం ద్వారా అబ్జర్వేషన్‌లో ఉంచనున్నట్టు వైద్యులు తెలిపారు.

‘స్వీట్’ విష్!

మామిడికుదురు (ఆంధ్రజ్యోతి) సినీ నటుడు చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లిలో 140 కిలోలు గల 70 రకాల స్వీట్లతో మెగాస్టార్ అని రాసి అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.



కాకినాడ

రేపు టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు

కాకినాడ రూరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలు ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎంపిక చేసిన కేంద్రాల్లో జరుగుతాయని డీఈవో పి.రమేష్ తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్‌తో పాటు అందుబాటులో ఉన్న ఒరిజనల్ ఆధార్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ లేదా డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఐడీని చీఫ్ సూపరింటెండెంట్‌కు చూపించాలన్నారు.

25న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ వికాస కార్యాలయంలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, టెక్నీషియన్, టెలిసేల్స్ రిప్రజెంటేటివ్స్, జూనియర్ ఇంజనీర్, సీనియర్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12వేల నుంచి రూ.20వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): అశోక్ లేలాండ్, టీంలీస్ సర్వీసెస్, పేటీఎం, సోషల్ సిస్టం ఇండియా, క్రెడిట్ అసోసియేషన్ గ్రామీణ్ సంస్థల్లో పనిచేయడానికి ఈ నెల 25వ తేదీ ఉదయం పది గంటల నుంచి కాకినాడ జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల పురుషులు, మహిళలు సర్టిఫికెట్లు, బయోడేటా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 86398 46568 నెంబరును సంప్రదించాలన్నారు.

'నా భర్తను అక్రమంగా అరెస్టు చేశారు'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సారా కేసులో తన భర్తను అక్రమంగా అరెస్టు చేశారంటూ శంఖవరం మండలం రాజవరం గ్రామానికి చెందిన మోసర నూకాలమ్మ శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగింది. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ఎక్సైజ్ అధికారులు రాజవరంలో సారా బట్టీలపై దాడులు చేశారని, అసలు నిందితులను వదిలేసి గ్రామ పెద్ద అయిన తన భర్త మోసర సోమరాజును అక్రమంగా ఇరికించారని ఆరోపించింది. తప్పుడు కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. కార్యక్రమంలో తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పిల్లి శ్రీను, తాతపూడి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

బైక్‌ల దగ్ధం కేసులో నిందితుడికి రిమాండ్

కాకినాడ క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఇటీవల మోటారు సైకిళ్లను దగ్ధం చేసిన కేసులో నిందితుడికి నాల్గవ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి నిరూపా బంజ్ డియో శుక్రవారం 14 రోజులు రిమాండ్ విధించారు. ఈ నెల 20వ తేదీ రాత్రి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాంబమూర్తినగర్, కోటమ్మ సందులో రెండు, జ్యోతుల కాలనీలో ఒకటి, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రేచర్లపేటలో మూడు బైక్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. దీనిపై రెండు పోలీస్ స్టేషన్లలోనూ కేసులు నమోదయ్యాయి. దర్యాప్తు చేపట్టిన పోలీసులు స్థానికుడైన 25 ఏళ్ళ దుంగా వీరమణికంఠను నిందితుడిగా నిర్ధారించారు. అతడిని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారు.

మహారాజశ్రీ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, కాకినాడ వారి కోర్టులో
O.S.No.125/2024
Between:
కొండా సునీత ...వాది
మరియు
గుర్రాల సత్యనారాయణ వగైరా ...ప్రతివాదులు
To,
దారపాటి వెంకట రమణి @ కృపావతి
W/o. దారపాటి ఆశిర్వాదం, Age: 47,
డోర్ నెం.03-17A-09, సీతారామనగర్,
గుదారిగుంట, కాకినాడ.
పై కేసులో కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు అందుకోని కారణం చేత శ్రీ కోర్టు వారు పై కేసును ది. **28-08-2025** తేదీకి వాయిదా వేసినారు. కావున **28-08-2025** తేదీన ఉదయం 10.30 ని॥లకు మీరు కోర్టు వారి ఎదుట హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమున విచారణ జరుగును.
పాలపర్తి సుబ్బారావు, అడ్వకేట్,
డోర్ నెం.11-12-1, త్రిపుర సుందరి గుడి దగ్గర, కాకినాడ. సెల్: 90300 22299






గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం, పిఠాపురం మహాలక్ష్మి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవికి గాజులతో ప్రత్యేక అలంకరణ

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం నగరంలోని పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహించారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి ఆలయంలో సుమారు 2,600 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారు. ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ ఏర్పాట్లు చేశారు. దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో సుమారు 1,700 మంది మహిళాలు సామూహిక వ్రతాలు ఆచరించగా వారికి చీర, రవిక, పూజా సామగ్రి అందించారు. ఈవో రాజేశ్వరరావు, బచ్చు శేఖర్, ఉత్సవ కమిటీ భోజనాలు ఏర్పాటు చేశారు. రామారావుపేట శివాలయంలో సామూహిక వ్రతాల్లో సుమారు 600 మంది పాల్గొన్నారు. జగన్నాథపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈవో సత్యవాణి ఆధ్వర్యంలో సుమారు 350 మంది సామూహిక వ్రతాలు ఆచరించారు. జగన్నాథపురం విష్ణాలయం, శివాలయాల్లో జరిగిన సామూహిక వ్రతాల్లో సుమారు 1,200 మంది మహిళలుపాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం బాలాత్రిపురసుందరి సమేత సర్వేశ్వరస్వామి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు వ్రతాన్ని ఆచరించారు. అనంతరం మహిళలకు అమ్మవారి రూపులు, చీరలను ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రరావు (బుజ్జి) ఆధ్వర్యంలో అందజేశారు. దేవస్థానం ఈవో పామర్తి కనక లక్ష్మణరావు, ప్రధానార్చకుడు మోటుపల్లి సుబ్రహ్మణ్యం, సూరిబాబు, యోగానంద సత్తిబాబు, టీడీపీ నగర ఉపాధ్యక్షుడు మేడిశెట్టి ఈశ్వరరావు (చిన్ని), చొక్కా గిరి, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. మహాగణపతి పూజ, కలశస్థాపన, నవగ్రంథతోరములను కలశం వద్ద ఉంచి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు వ్రతాలు జరిపించారు. వరలక్ష్మీ దేవికి ప్రీతికరమైన చారుమతీదేవి వ్రత కథ ప్రత్యేకత, విశిష్టతను వివరించారు. ఆలయ సేవా సమితి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయంలో...

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా సమేత నాగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన, సహస్ర నామార్చన నిర్వహించారు. అమ్మవారిని పదివేల గాజులతో అలంకరించారు. ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు జరిపారు. వేద పండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): శృంగేరీ శంకర మఠం నిర్వహణలోని మహాలక్ష్మి ఆలయంలో జరిగిన వ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. వాసవికన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు.




ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

సామవేదం షణ్ముఖశర్మ

పిఠాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని 'ప్రవచన విరించి' సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. పట్టణంలోని కార్తికేయ ఆసుపత్రికి వచ్చిన ఆయనకు వేద పండితులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ప్రభాకరశాస్త్రి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో సమాజం సుఖశాంతులతో ఉంటుందని చెప్పారు. ఆసుపత్రి అధినేత డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథ్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు. అనంతరం షణ్ముఖశర్మ పట్టణంలోని మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించారు.

తాగునీటికి ఇక్కట్లు



కొత్తపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లితో పాటు పలు గ్రామాల్లో ఇంటింటికీ ఉచితంగా మంచి నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. దీంతో పంచాయతీకి పన్ను చెల్లించి కుళాయిలు వేసుకున్న వారు వాటిని తొలగించుకొన్నారు. ఉచిత కుళాయిలను ఏర్పాటు చేసుకొన్నారు. కుళాయిలు ఏర్పాటుచేసే సిబ్బంది ఉచితంగా కుళాయిలు కావాలనే ఇళ్ల వద్ద ప్రత్యేకంగా మెటల్ పైపు, ఇత్తడి ట్యాప్‌లను ప్రజల సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. జేజేఎంలో ఏర్పాటుచేసిన కుళాయిల నుంచి రోడ్డుకు సమాంతరంగా ఉన్న ఏరియాల్లో తాగునీరు సన్నగా వస్తోంది. మిగిలినచోట్ల అదికూడా రాకపోవడంతో మెటల్ పైపుకు అమర్చిన పైపును తొలగించి కింది నుంచి తాగునీరు పట్టుకుంటున్నారు. కాగా ఈ కనెక్షన్లకు వాకతిప్పలో రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు సరఫరా జరుగుతోందని నిర్వాహకులు చెప్తున్నారు.

విద్యార్థినులకు 'రిలయన్స్' న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



కాకినాడ సిటీ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ తన సామాజిక బాధ్యతలో భాగంగా గాడిమొగ, భైరవపాలెం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థినులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. కౌమార దశలో బాలికల ఆరోగ్య రక్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం కాకినాడ దంటు కళా క్షేత్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ పీడీ సి.లక్ష్మి మాట్లాడుతూ బాలికలు కౌమార దశలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, సీడీపీవో మాధవి బాలికల నుద్దేశించి మాట్లాడారు. పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిదులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫైనాన్స్ హెడ్ మదన్‌పాల్, సీఎస్ఆర్ హెడ్ పోతాప్రగడ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



కాకినాడ గొడారిగుంటలో కేక్ కట్ చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి గొడారిగుంటలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ చిరంజీవి తన నటనా చాతుర్యంతో ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సాధించారన్నారు. కార్యక్రమంలో నాయకులు శిరంగు శ్రీనివాసరావు, మాదారపు తాతాజీ, జీని శ్రీనివాస్, తాటికాయల వీరబాబు, గోపు వెంకటరమణ, గవర పాపారావు, మేడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): కరప దుర్గాదేవి గుడి వద్ద మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు ఆధ్వర్యంలో నిర్వహించిన మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలో జనసేన నేత డాక్టర్ బొండా సూర్యారావు భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. పలువురు పారిశుధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. హైస్కూలు ఎదురుగా పలావు సెంటర్ నిర్వాహకులు సానా వీరబాబు, సానా ఏసుబాబు వందలాది మందికి ఉచితంగా బిర్యానీ పంపిణీ చేశారు. కరప డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వీజీ సత్యనారాయణ (బాబులు), టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు దేవు వెంకన్న, కరప, వేములవాడ సొసైటీల అధ్యక్షులు సైనవరపు భవానీ శంకర్, దూడల నారాయుడు, వీఆర్వో సోమరాజు, వివిధ పార్టీల నాయకులు బోగిరెడ్డి గంగాధర్, లకమన సురేష్, పెంకే సత్తిబాబు, మద్దూరి స్వామి, నక్కా సత్తిబాబు, నక్కా శ్రీనుబాబు, గోన చిన్నయ్య, చోడపునీడి వెంకటరమణ, వీరంరెడ్డి ముత్యాలరావు, సాదే లోహిదాసు, మేడిశెట్టి అప్పలస్వామి, కోన వెంకటలక్ష్మి, ఆచంట నాగు, పేకేటి దుర్గాప్రసాద్, పేపకాయల తణుకులరాజు, పరమేశు, మెండు గోవిందు, బోనాసుల పుల్లయ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కోసం అంకితభావంతో పనిచేయాలి: వర్మ



టీడీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వారిని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి

పిఠాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పటిష్టతకు అంకితభావంతో పనిచేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సూచించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిశీలకుడు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి సమక్షంలో పిఠాపురం పట్టణ, మండల, గొల్లప్రోలు పట్టణ కమిటీల ఎన్నికలు జరిగాయి. పిఠాపురం పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొజ్జా సతీష్, కొరుప్రోలు శ్రీను, మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సకుమళ్ల గంగాధర్, నెక్కల సత్యనారాయణ ఎన్నిక కాగా, గొల్లప్రోలు పట్టణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గుండ్ర సుబ్బారావు, బస్సా సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని వర్మ, చంద్రమౌళి అభినందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు, గ్రామ కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు.



తోలుబొమ్మలాట ప్రదర్శిస్తున్న కళాకారులు

అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా నగరంలోని పాత బస్టాండు ప్రాంతంలో తోలుబొమ్మలాట వృత్తి కళాకారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు అనపర్తి ఏడుకొండలు, కార్యదర్శి తోట బాలకృష్ణ భీమన్న ఆధ్వర్యంలో శుక్రవారం 'సీతాపహరణం' తోలుబొమ్మలాట కథను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగా తోలుబొమ్మలాట కులస్తులను బీసీ(ఎ)లో చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు.



నవోదయాలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దాపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ జవహర్ నవోదయాలో ఆరవ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష ఈఏడాది డిసెంబరు 13న నిర్వహిస్తామన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఎమ్మెల్యే శిరీషదేవి ఆకస్మిక పర్యటన



దాలిపాడు ఆశ్రమ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వై.రామవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాడు, నేడు భవన నిర్మాణాలు, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టిసారించి, చర్యల కోసం అధికారులకు నివేదిస్తామని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి తెలిపారు. శుక్రవారం ఆమె అడ్డతీగల, వై.రామవరం మండలాల్లో ఆకస్మికంగా పర్యటించారు. దాలిపాడు, పనసలపాలెం, కేజీబీవీ, పి.ఎర్రగొండ పాఠశాలల వసతిగృహాలను సందర్శించారు. చాలా చోట్ల నాడు, నేడు నిర్మాణాలు అసంతృప్తిగా ఉన్నాయన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈ పనులు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు, నిర్మాణాలకు పొంతన లేదన్నారు. గతంలో పనిచేసిన టీచర్లు సరైన రికార్డులు అప్పగించకపోవడంపై ఆగ్రహం చెందారు. అలాగే పాఠశాల్లో టీచర్ల కొరత ఉందని, వసతి గదులు, తాగునీరుకు ఇబ్బందులున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సానుకూలంగా స్పందించారు. కూటమి నేతలు విండేలా సుబ్బారావు, పల్లాల మంగిరెడ్డి, జే.సత్తిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ త్రిమూర్తులు, టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలి'

రంపచోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా కారం తమ్మన్నదొర పేరుతో ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కంగల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఏజెన్సీ పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు నాయుడు రంపచోడవరం కేంద్రంగా ఆదివాసీలకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు మట్ల కృష్ణారెడ్డి, తెల్లం శేఖర్, పొడియం పండుదొర, పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, మడకం ప్రసాద్‌దొర, చవలం శుభకృష్ణదొర, పండా పవన్‌కుమార్‌దొర, పొడియం శ్రీనుబాబు, కర్రి సన్యాసిరెడ్డి, కత్తుల రమణరెడ్డి, కారం రామన్నదొర పాల్గొన్నారు.

సీతపల్లి గడిబాపనమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

రంపచోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సీతపల్లి గడి బాపనమ్మ వారి ఆలయంలో ఆలయ అధికారి సత్యరమేష్, చైర్మన్ కుంజం బాపన్నదొర ఆధ్వర్యంలో శుక్రవారం అర్చకులు బత్తిన రామకోటేశ్వరరావు వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం వ్రతం ఆచరించిన మహిళా మూర్తులకు లక్కీడ్రా ద్వారా చీర, వెండి ప్రతిమ, గాజులు, అమ్మవారి రూపు, పసుపు, కుంకుమ అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు పీ. అనంతమోహన్, విశ్వహిందూ పరిషత్ జిల్లా సత్సంగ ప్రముఖ్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన



బోట్‌పై శ్రీరామగిరి వెళ్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

వీఆర్‌పురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ముంపునకు గురైన గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. వరదలో చిక్కుకున్న శ్రీరామగిరి గ్రామానికి బోట్‌లో వెళ్లి అక్కడి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం వరద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. గ్రామంలోని 40 కుటుంబాలకు రేఖపల్లి ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వి.గాంధీబాబు ఆధ్వర్యంలో కలెక్టర్ చేతుల మీదుగా టార్పాలిన్లు, దోమతెరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఇంజన్ బోట్ ద్వారా మొద్దులగూడెంకి వెళ్లి అక్కడి వారితో మాట్లాడారు. జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, టీడీపీ నేతలు బొర్ర నరసింహారావు, జంగాల మల్లిఖార్జున్, ముత్యాల సిద్దార్థ, బొర్రా ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేదు

రాజవొమ్మంగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఇకపై మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉండదని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఏకలవ్య పాఠశాలలో మంచినీటి, ప్రహరీ సమస్యను ప్రిన్సిపాల్ కృష్ణారావు వివరించారు. విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి, వారికి అందే మెనూపై ఆరా తీశారు. విద్యార్థినుల విద్య సామర్థ్యతపై కలెక్టర్ ఉపాధ్యాయులకు పలు ప్రశ్నలు వేశారు. కొందరు సరిగ్గా చదవకపోవడంపై టీచర్లపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తహశీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.

మందులు అందుబాటులో ఉంచుకోవాలి : పీవో

రంపచోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లోని సబ్‌సెంటర్లలో వ్యాధులకు సంబంధించి అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం సూచించారు. శుక్రవారం ఆయన ముసురుమిల్లి సబ్‌సెంటర్, అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పిల్లలకు కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. ఏడీఎంహెచ్‌వో డేవిడ్, మలేరియా నివారణ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోతుగూడెం సచివాలయం సందర్శన

మోతుగూడెం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం సచివాలయాన్ని శుక్రవారం చోడవరం డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ నిమ్మకాల కోటేశ్వరరావు సందర్శించారు. దీనిలో భాగంగా రికార్డులు తనిఖీలు చేశారు. అనంతరం సమస్యల గురించి పంచాయతీ కార్యదర్శి జీ. మోహన్‌ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

రైతులకు యూరియా బస్తాల పంపిణీ

దేవీపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శరభవరం గ్రామ పంచాయతీలోని రైతుసేవా కేంద్రంలో రైతులకు శుక్రవారం యూరియా బస్తాలను పంపిణీ చేశారు. దీనికి సర్పంచ్ కొమరం లక్ష్మీదేవి, సర్పంచ్ తుర్రం రమాదేవి, ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర, ఏవో, కూటమి నాయకులు హాజరయ్యారు. రైతులంతా తప్పనిసరిగా భూమి 1బీ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి ప్రవాహం

కూనవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టడంతో మన్యం వాసులు ఊపిరిపీల్చుకుంటున్నారు. కూనవరంలో 50 అడుగులకు చేరుకోగా, శుక్రవారం తెల్లవారుజాము మూడుగంటల నుంచి నిలకడగా ప్రవహిస్తోంది. ఉదయం ఐదుగంటల నుంచి క్రమేపీ తగ్గుతూ సాయంత్రానికి ఒక అడుగు తీసింది. అయినా మండలంలోని పలు గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. కూనవరం భద్రాచలం మధ్య ఉన్న ప్రధాన రహదారి ఇంకా ముంపులోనే ఉంది.



లోకేష్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి

రంపచోడవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో మంత్రి నారా లోకేష్‌ను రంపచోడవరం మాజీఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని సమస్యల గురించి వివరించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి ఉచిత బస్సు పథకం కారణంగా ఆటో కార్మికులు ఉపాధి సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ చేయూత నందించారు. స్థానిక గోకవరం రోడ్డులోని కాపుకల్యాణ మండపంలో నియోజకవర్గంలో 4 మండలాలకు సంబంధించిన 1740 మంది ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం అందజేశారు. ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మీకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగ్గంపేట గోకవరం రోడ్డులోని మినీ ఇండస్ట్రీయల్ పార్కులో అర్హులైన వారికి ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జ్యోతుల అనీష్ నెహ్రూ, ఎస్వీఎస్ అప్పలరాజు, అడపా భరత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, మారిశెట్టి భద్రం, వీరం రెడ్డి కాశిబాబు, పిల్ల చంటిబాబు, పుష్కర ప్రాజెక్ట్ కమిటీచైర్మన్ అడబాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు



జగ్గంపేటలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేస్తున్న తుమ్మలపల్లి రమేష్

జగ్గంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు చిరంజీవి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీచర్స్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల పిల్లలతో కలిసి వేడుకల్లో జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. కేక్ కట్ చేసి విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్స్ పంపిణీ చేశారు. రామచంద్ర పురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణ శేఖర్, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మరిసే రామకృష్ణ, మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్, పాఠంశెట్టి రమేష్,పులి ప్రసాద్, జుట్టుక నాగేశ్వరావు, పాల్గొన్నారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకల సందర్భంగా ఏలేశ్వరంలో శుక్రవారం చిరంజీవి అభిమాన సం ఘం ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలు శైలజ రోగులకు రొట్టెలు, పండ్లు, పాలు పంపిణీ చేశారు. అభిమానులు కేక్ కట్‌చేసి పంచారు. భవి త కేంద్రంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముచ్చర్ల రమేష్, లోగీసు శేఖర్, మామిడి శ్రీను, అనంతారపు రాజు, బిగ్‌బాస్, ధనబాబు, దత్తిరాజు, కోరాడ రాజు, బీశెట్టి రాజా, అతం అప్పారావు పాల్గొన్నారు.

రౌతులపూడి(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి గ్రామంలో చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల చిరంజీవి యూత్ అధ్యక్షుడు నిర్జా నాగు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. జనసేన నేతలు షేక్ సలీమ్, కత్తిపూడి సత్రం డైరెక్టర్ పక్కుర్తి సతీష్, స్వామి, సర్నం గంగబాబు, బక్కల నానాజీ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల



యనమల సమక్షంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలు

తునిరూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. తొండంగి, తుని మండలాల్లో పలు గ్రామాల నుంచి వైసీపీ నాయకులు ఆ పార్టీకి రాజీనామాచేసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా యనమల మాట్లాడుతూ పార్టీ ఉన్నతికి సమష్టిగా పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో నూరుశాతం కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా పనిచేయాలని తెలిపారు. అనంత హంసవరం గ్రామానికి చెందిన వందకుపైగా వైసీపీ కార్యకర్తలకు యనమల కండువా కప్పి ఆహ్వానించారు. తొండంగి మండలం దానవాయిపేట శివారు నర్సిపేట గ్రామానికి చెందిన 50 కుటుంబాలు టీడీపీలో చేరగా యనమల ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, మండల మహిళా అధ్యక్షురాలు తమరాన వరలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు కాలి బోయిన గంగారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ఏలేశ్వరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఏలేశ్వరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని తదితర సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు శుక్రవారం ధర్నా చేశారు. సీఐటీయూ పిలుపు మేరకు మండల పరిధిలోని అంగన్‌వాడీలు ఏలేశ్వరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహశీల్దార్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్.అమలావతి, నూకరత్నం, నాగలక్ష్మి, రాణి, సుజాత పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆసుపత్రి వద్ద పరిశుభ్రత చర్యలు

ప్రత్తిపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి అంగన్‌వాడీ కేంద్రం, పెద్దిపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద శుక్రవారం ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో పరిశుభ్రత చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ-2 కేంద్రంతో పాటు సచివాలయ కేంద్రాల వద్ద చెత్తాచెదారాలు, పెంటకుప్పల నిల్వలు అపారిశుధ్యం నెలకొనడంతో గ్రామ కార్యదర్శి దడాల మహేష్ చెత్తకుప్పలను ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో బయటకు తరలించే పనులు నిర్వహించారు. పెద్దిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట అధ్వానంగా ఉన్న చెత్తాచెదారాలను తొలగించే చర్యలు చేపట్టారు.

నిధులు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు

జగ్గంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం పునఃర్నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రూ.52 కోట్లు నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు తాళ్లూరు పుష్కర ఆయకట్టు రైతుల పక్షాన స్థానిక పాటంశెట్టి సూర్యచంద్ర అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విశ్రాంతి ఉద్యోగి అప్పారావు

ఏలేశ్వరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లోను రాణించాలని ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెషర్ విశ్రాంత ఉద్యోగి బి. అప్పారావు అన్నారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత నేతృత్వంలో స్థానిక లారీ యూనియన్ కార్యాలయంలో ప్రధానమంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్ పథకంలో విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. అశోక్‌కుమార్, వరప్రసాద్, అనంతరావు, వర్క్‌షాప్ కన్వీనర్లు ప్రయాగమూర్తి, సురేష్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

'వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి'

ప్రత్తిపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గిరిబాబు కోరారు. నియోజకవర్గ వైసీపీ అనుబంధ కమిటీ విభాగాల నాయకులు, సభ్యుల విస్తృత స్థాయి సమావేశం శనివారం మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసంలో నిర్వహించారు. కార్యక్రమంలో రౌతులపూడి జడ్పీటీసీ గొల్లు దివానం, ఏలేశ్వరం మాజీ జడ్పీటీసీ చిడగంవెంకటేశ్వరరావు,నాయకులు నరాల శ్రీను, రామిశెట్టి నాని, గుడాల వెంకటరత్నం, యుజేపురం సర్పంచ్ నడిగట్ల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

'నా భర్తను అక్రమంగా అరెస్టు చేశారు'

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సారా కేసులో తన భర్తను అక్రమంగా అరెస్టు చేశారంటూ శంఖవరం మండలం రాజవరం గ్రామానికి చెందిన మోసర నూకాలమ్మ శుక్రవారం కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగింది. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకినాడ ఎక్సైజ్ అధికారులు రాజవరంలో సారా బట్టీలపై దాడులు చేశారని, అసలు నిందితులను వదిలేసి గ్రామ పెద్ద అయిన తన భర్త మోసర సోమరాజును అక్రమంగా ఇరికించారని ఆరోపించింది. తప్పుడు కేసులు నమోదు చేసిన ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. తెలుగు జనతా పార్టీ అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు పిల్లి శ్రీను, తాతపూడి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ ఏజెన్సీని మండలంగా ఏర్పాటు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న సబ్‌ప్లాన్ ప్రత్యేక మండల ఏజెన్సీ సాధన కమిటీలు

ప్రత్తిపాడు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సబ్‌ప్లాన్ ఏజెన్సీని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని నియోజకవర్గ సబ్‌ప్లాన్ ఏజెన్సీ మండల సాధన కమిటీ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉపప్రణాళిక ప్రాంతంలోని 59 నాన్‌షెడ్యూల్ ఆదివాసీ గిరిజన గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాల విభజన అనంతరం సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రాంతానికి ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయలేదని, దీని వల్ల ఉద్యోగ, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు దెబ్బతిన్నాయని గిరిజనులు వాపోయారు. 40ఏళ్లుగా ప్రత్యేక మండలం కోసం పోరాటం చేస్తున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వం సబ్‌ప్లాన్ ఏజెన్సీ ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన నాయకులు జర్తా ముసలయ్య, పి.బాలరాజు, బి. బాలరాజు, టి. నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీను కోరారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తాళ్లూరు పుష్కర లిఫ్ట్ మరమ్మతులకు ప్రభుత్వం రూ.52కోట్లు విడుదల చేసిన సందర్భంగా తాళ్లూరు లిఫ్ట్ వద్ద పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అడబాల భాస్కరరావు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చిత్రపటాలకు రైతులతో కలిసి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను రైతులందరూ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, అడప భారత్, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, మారిశెట్టి భద్రం, కందుల చిట్టిబాబు, బుర్రి సత్తిబాబు, సుంకవిల్లి రాజు, బొల్లం రెడ్డి రామకృష్ణ, పైడిపాల సూరిబాబు, రేఖ బుల్లి రాజు పాల్గొన్నారు.

లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

తునిరూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గుంటూరులో ఈనెల 30,31న జరిగే ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని తుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరించారు. తుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకట చక్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై అనేక దాడులు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని సదస్సులో న్యాయవాదులు పిలుపునివ్వాలన్నారు. కార్యక్రమంలో మాకినీడి బాబు, జీవి రమణ, సాక సత్తిబాబు, ఆర్వి రావు, వాసిరెడ్డి ప్రసాదరావు పాల్గొన్నారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సత్కారం



జీను మణిబాబును సత్కరిస్తున్న సంఘ సభ్యులు

జగ్గంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెవిఆర్ అపార్టుమెంట్‌లో టీడీపీ జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబుని జగ్గంపేట రావులమ్మ తల్లి తోపుడుబండ్ల చిన్న వర్తకుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వానశెట్టి తాతాజీ, సెక్రెటరీ బొడ్డు కొండ వెంకటరమణ ఆధ్వర్యంలో మర్యాదపూర్వంగా కలిసి ఘనంగా సత్కరించారు. సమస్యలు వివరించగా పరిష్కరించి ఇళ్ల స్థలాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలియజేశారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్తిపాడు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో శ్రావణ మాస పూజలు జరిగాయి. ఆఖరి శుక్రవారం కావడంతో రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో అపీతకుచాంబ అమ్మవారిని అర్ధనారీశ్వరుడుగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు రామానంద స్వామి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించి పూజ లు చేశారు. భక్తులకు ప్రసాద పంపిణీ చేశారు. కాకినాడ ఐడియల్ కళాశాల విశ్రాంత వైస్ పిన్సిపాల్ కె.రామకృష్ణ పరమహంస, ఎస్‌బీఐ విశ్రాంత అధికారులు కూచి భాస్కరరావు దైవ సన్నిధిలో కర్నాటక సంగీతాన్ని ఆలపించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, పెద్దిపాలెం గ్రామాల్లోని కనకదుర్గ ఆలయాలవద్ద పూజలు నిర్వహించారు.

చీరల అలంకరణలో వాసవీమాత



అన్నవరం(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఉన్న వాసవీ అమ్మవారు చివర శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని చీరల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రంగులలో ఉన్న 130 చీరలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించి అర్చకస్వాములు పూజలు నిర్వహించారు. అనంతరం వీటిని భక్తులకు ఉచితంగా పంపిణీచేస్తామని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. అధికసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వరమహాలక్ష్మికి పుష్పాలంకరణ



తునిరూరల్(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిట్టూరి మెట్టలో శ్రీ వైకుంఠ నారాయణ సహిత వరమహాలక్ష్మి అమ్మవారికి విశేష పుష్పలంకరణ నిర్వహించారు. సుప్రభాత సేవ, కుంకుమార్చన నిర్వహించి 150 మంది భగవద్గీత పారాయణం చేశారు.

'లోవ'లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

తునిరూరల్(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో శ్రావణ మాస చివరి శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిగాయి. పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులకు ఉచిత పూజాసామగ్రి అందజేశారు. భక్తులకు ఆలయ వేద పండితులు అర్చకులు వేద ఆశీర్వచనం, పసుపు కుంకుమ గాజులు ప్రసాదం అందజేశారు.

'ఆదిత్య' విద్యార్థుల పరిశ్రమల సందర్శన

గండేపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు పరిశ్రమ పరిజ్ఞానం అందించేందుకు విశాఖపట్నంలోఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ పరిశ్రమ సందర్శన నిర్వహించినట్లు డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మొత్తం 65మంది విద్యార్థులు, అధ్యాపకులు జె.డి.వెంకటేష్, డాక్టర్ డి రాంబాబు ఉన్నారు.

శ్మశానవాటిక రహదారి ఆక్రమణపై నిరసన

తొండంగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తొండంగిలో దళితుల శ్మశానవాటికకు వెళ్లే రహదారిని కొందరు అక్రమంగా ఆక్రమించి నిర్మాణం చేపట్టారని, వాటిని తొలగించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

పాలచర్ల నాగేంద్రచౌదరికి సత్కారం

జగ్గంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం జె. కొత్తూరు గ్రామ శివారు కనక దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం సేవా రత్నా అవార్డు గ్రహీత హిందూ ధర్మ పరిరక్షణ సేవ సమితి రాష్ట్ర బోర్డు మెంబర్, భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

